# 12. జగతిలో జాతులు రెండే

రవణ ఇంటికి వస్తూనే రాధనిచూస్తూ అన్నాడు. "రాధా, గుడ్‌న్యూస్, అనుకోకుండా నీకో తోటి ప్రయాణికురాలు దొరికింది. ఈసారి నిన్నంత దూరం ఒంటరిగా పంపిస్తున్నాననే బాధ నాకులేదు. వాళ్ళ జయకూడా ఎల్లుండి మెయిల్లో బయలుదేరుతోందిట".

"ఏ జయా?" అంది రాధ మొహం చిట్లించి.

"బాగుంది అప్పుడే మరచిపోయావా? ఆవాళ మీరిద్దరూ పేరంటంలో కలిశారని కూడా చెప్పేవు. జయలక్ష్మి మా ఫ్రెండు సుందరం - ఎవడు, ఆ యిన్కంటాక్సు ఆఫీసరు లేడూ, అతగాడి భార్య, ఇందాక ఏదో మాటలో మాటొచ్చి ఇలా మా వాళ్ళు ఎల్లుండి వెడుతున్నారు అని చెప్పాడు. హాయిగా మీరిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వెడితే ప్రయాణం చేసినట్టే ఉండదూ, ఏం?"

"మీకు వయసయితే వచ్చిందిగాని అనుభవం లేదు!" అని గొణిగింది రాధ.

"ఏమిటి, ఏమంటున్నావ్!" అన్నాడు రవణ దగ్గరగావచ్చి.

"ఏం లేదూ, మిమ్మల్ని ఒదిలి వెళ్ళాలంటే ఎంతో ఇదిగా ఉంది."

"పిచ్చిదానా, ఈ పదిరోజుల ఎడబాటుకేనా అంత దిగులూ? పెద్దక్క దగ్గరికి వెళ్ళొస్తానని ఎగిరిగంతేసింతసేపు పట్టలేదూ, అంతట్లోనే బెంగెట్టుకుంటున్నావా? ఇంతకి ఎల్లుండి మాట గద!" రవణ భార్యని ఓదార్చాననుకుని సైకిల్ ఎక్కి వెళ్ళిపోయాడు.

మూడురోజుల క్రిందట బెజవాడలో ఉన్న పెద్దక్కయ్యనుంచి విజయనగరంలో ఉన్న రాధకి ఉత్తరం వచ్చింది. ఆమె రెండోకూతురికి పదిహేను రోజులై జ్వరం, పిల్ల ఒళ్ళెరగదట. ఒక్కర్తీ చేసుకోలేక, ఏ మాత్రం వీలయినా విడిమనిషి గనక, రాధని ఓ సారి వెంటనే పంపమని తను రాయడమేకాకుండా మొగుడిచేత మరిదికి రాయించింది.

"చిట్టి ఒంట్లో ఎలా ఉందో ఏమిటో!" అని ఆ క్షణంవరకు గిలగిల కొట్టుకుంది రాధ.

"జయతో ఎలా ప్రయాణం చేసేది భగవంతుడా!" ఆ క్షణం నుంచి దడదడ కొట్టుకోజొచ్చింది రాధ గుండె! ఆమె కోపమంతా రవణ మీదకి మళ్ళింది. తనకేది కావాలో అతనికి తెలీదు. అక్కర్లేనిది అమర్చిపెట్టడంలో, తనంతటివాడు లేడు. ఒక్కసారి యిలా వీధిలోకి వస్తే, స్కూటరుమీద రయ్‌మని షికార్లుకొట్టే జంటల్ని చూస్తే, కళ్ళు జిగేలుమని పోతాయి. ఏం చీరలు, ఎన్నిరకాల నగలు, ఏమి ఫాషన్లు, పెద్ద పండుగవచ్చినా తనబతుక్కి పాతిక రూపాయలు మించిన బట్టలేదు! వెధవ పాతిక రూపాయలకు ఏం వస్తుంది ఈ రోజుల్లో! పోనీ తమకేమైనా చచ్చినన్ని బాధ్యతలా, యిల్లు నిండిపోయే పిల్లలా? ఏమీలేదు. ఏం లేకపోయినా అసమర్థతకి మాత్రం ఏమీ లోపంలేదు. ఎన్నాళ్ళయినా నల్లపూసలూ, నేత చీరలూ! గుట్టు చప్పుడు కాకుండా ఈ నాలుగు గోడలమధ్య రెండో కంటి వాడికి తెలీకుండా తన ఏడుపేదో ఏడుస్తోంది. అలాగైనా తను ఉండడం రవణకి గిట్టలేదా! రాధ కళ్ళు వత్తుకుంది పవిటచెంగుతో.

ఆరోజు పేరంటంలో జయలక్ష్మిని కలుసుకోమని ప్రోత్సహించిందీ ఈ పెద్దమనిషే! ఏదో టిష్యూ జరీచీరట. యింతింత జరీపువ్వులూ అదీ. ఏ అయిదు వందలు చేస్తుందో. అది కట్టుకుని మహారాణిలా చక్కా వచ్చింది జయలక్ష్మిగారు. ఏ పదిపేటలు ఉంటుందో మెళ్ళో యింతకట్ట. ఒక్కొక్క చేతికి ఎనిమిదేసి జతల గాజులు. అందరూ ఆవిడచుట్టూ మూగేరు. కయ్యానికేనా వియ్యానికేనా అంతస్తు చూసుకోవాలి. అతనికి ఆ మాత్రం యిది ఉండొద్దూ! నలుగుర్లో తనకి తల తీసేసినట్టయింది. అంత ఐశ్వర్యవంతురాలు. ఆఫీసరు పెళ్ళాం తనని పలకరిస్తుందో లేదో అని సిగ్గుతో చచ్చిపోయింది రాధ.

" మీరు ఎం.ఏ చదువుకున్నారటగా? మాలాంటి అయిదో క్లాసు వెలిగించిన ఆడాళ్ళతో మాట్లాడతారో మాట్లాడరో!"

ఇదీ జయలక్ష్మిగారి పలకరింపు! ఇంతకంటే చాచి లెంపకాయ కొట్టడం అంటూ ఉంటుందా! ఆ రాత్రి అయిదు నిమిషాలు నిద్ర పట్టలేదు రాధకి. కసిదీరా కన్నతండ్రిని శపించింది. చిన్న దాన్ని.... నువ్వే చదువుకోమంటే చదువుకున్నాను. నీకే నామీద ఆమాత్రం దయలేకపోయిందా నాన్నా! ఏం చేసుకోమన్నావ్ ఈథర్డుక్లాస్ ఎమ్మేతో! ఎందుకీడిగ్రీ. నలుగురిలో నగుబాటు! ఓ కూడెట్టునా, గుడ్డెట్టునా, నా చదువు కోసం నువ్వు వృధాచేసిన సొమ్ముతో సగం ఖర్చుపెడితే నా బీరువా నిండివుండునే!

పోనీ ఏదో ఆ పేరంటంనాడు అలా అయిపోయింది. పుండుమీద కారం జల్లడం కాకపోతే యింకెవ్వరూ దొరకనట్టు అక్కయ్య కూతురికి జబ్బుచేసి ఎంతోకష్టంవచ్చి తను బయల్దేరుతూంటే... తనకి ఈ జయలక్ష్మిగారేనా తోడు! అపహాస్యం పాలు కావాలా? తన అవమానం రవణకికూడా అని అతను ఈజన్మలో తెలుసుకోలేడా!

అయ్యో రామ! విమానాలమీద తిప్పుతున్నారు పెళ్ళాల్ని! కారుల్లో డ్రైవ్‌చేస్తూ పక్కని భార్యల్ని కూచోపెట్టుకుని కాలు కింద పెట్టనియ్యకుండా అడుగులకి మడుగులొత్తుతున్నారు మొగుళ్ళు! మరీ తన ఇష్టం అయితే వీధిలో టాక్సీ నిలబెట్టి ఈసారికి ఎలాగోలా ఎక్కమని గంటల కొద్దీ బతిమాలుతున్నారు. తన పాడుమొహానికి ఏ అదృష్టమూ లేదు. కిక్కిరిసిన మెయిల్లోని థర్డు క్లాసు కంపార్టుమెంట్ తనమొహాన్ని రాసి పెట్టి ఉంది. అలాగేనా అఘోరించనివ్వరాదా? ఆ జయలక్ష్మిగారెలాగా ఫస్టుక్లాసు కొనుక్కుంటుంది. తనని చూసి నవ్వుతుంది. ఈమాత్రం ఇంగితంలేదా తనమొగుడికి! "ఏమిటో పొద్దుట్నించి అదోలావున్నావు!" అన్నాడు ఆసాయంకాలం రవణ. చెబ్దామని నోటికొసదాకా వచ్చింది రాధకి. కాని అతన్తో కాపురంచేసిన ఈ అయిదేళ్ళ అనుభవమూ ఆమెని మాట్లాడనివ్వలేదు. అర్ధంచేసుకునే వాళ్ళతో ఏం చెప్పినా అందమూ చందమూ. వితండవాదన చేసేవాళ్ళతో ఎవరు మాట్లాడగలరు! ఒకటి అంటే పది చెబుతాడు. " డబ్బున్న వాళ్ళందరూ కులాసాగా ఉండిచచ్చారా! అంటాడు. "ఇప్పుడు మనకొచ్చిన లోటేమి"టంటాడు. కష్టంగాని, సుఖంగాని మనం అనుకోడంలో ఉందంటాడు. "మనకేం లేదా. పోదా" అంటాడు. నెలకి ఓ యాభై రూపాయలు కట్టుకున్నదానికి పై ఖర్చుకని యివ్వలేని వాజమ్మ ఎన్నేనా అంటాడు. అనడా మరి?

చెప్పి లాభంలేదు. వాదించి ప్రయోజనం లేదు యిలాంటివాళ్ళతో. ఎన్నిసార్లు తను ఓడిపోయింది కాదు? నేర్పుగా తప్పించుకోవాలి తనకివచ్చిన ఆపదని!

" మాట్లాడవేం రాధా, ఏం అలా ఉన్నావు? చిట్టి ఎలా ఉందనేనా? ఈ పాటికి తగ్గిపోయి ఉంటుందిలే... చూస్తావుగా.... ఎల్లుండి అంటే ఇంక రెండ్రోజులేగా!

"అవునండీ. కన్నుమూసినా తెరచినా అదెలా ఉందోననే బెంగ. పదిహేను లంకణాలంటే మాటలా! ఎగిరి వెళ్లాలని ఉంది, అంచేత...." .... రేపే వెళ్ళిపోతేనో? అందామనుకున్న మాటలు నోటిలోనే ఆగిపోయాయి. నిజంగా ఆమర్నాడే వెళ్ళిపోతే జయతో బెడద ఉండదు. కాని ఆ మర్నాడు సాయంకాలం అర్జెంటుగా తెమ్మని చాకలాడికి బట్టలువేసింది గద!" ....

"అంచేత? ఆపేశావేం?"

"మరేంలేదండీ... ఎన్నో అపశకునాలు తోస్తున్నాయి. ఎల్లుండి వారమేకాదు వర్జ్యం కూడా బాగులేదుట. శాస్త్రులు చెప్పారు"

"పోనీ ఆవలెల్లుండి బయల్దేరుదూ"

"అవునండీ ఆమాట బాగుంది. ఆరోజు మంచిదటకూడా"

"అయితే సరే... అన్నట్లు జయలక్ష్మి ముందే వెళ్ళిపోతుందేమో... పోన్లే నువ్వొక్కర్తెవీ ఎన్నిసార్లు వెళ్ళలేదుగనక!" అన్నాడు రవణ, రాధముఖం క్రమక్రమంగా వికసించడం చూసి.

✪

"ఓడలు బళ్ళుఅవడం అంటే ఇదే కాబోలు. ఇలా గిల్టునగలు వేసుకుని అద్దెచీరలు కట్టుకుని తిరగవలసివస్తుందని కలలో అనుకోలేదు" అంది జయలక్ష్మి చిన్నబోయిన మొహంతో.

"మన దురదృష్టం అక్కడితో ఆగితే బాగానే ఉణ్ణు." అన్నాడు సుందరం పొడిగా నవ్వుతూ. ఆఫీసర్లమీద కిట్టనివాళ్ళ కాగితాలెప్పుడూ పైవాళ్ళకి వెళుతూనేఉంటాయి. అలా అనుకునే సుందరం అలాంటివి ఎప్పుడూ లెక్క పెట్టలేదు. అయితే ఆ అజాగ్రత్తే కొంప తీసింది. అనుకోకుండా ఇన్‌స్పెక్షన్ జరిగిపోయింది. రికార్డు కూడా సీలువేశారు. ఇక చార్జిషీటు యివ్వడమే తరువాయి. ఇంకా ఆ కాగితాలు హెడ్డాఫీసుకు చేరకుండా జాగ్రత్తపడాలి. అలా చెయ్యగల వాడూ సుందరాన్ని ఈ ఆపదనుంచి రక్షించగలవాడూ ఒక్కడే ఉన్నాడు. జయలక్ష్మి మేనమామ. ఆమె అంటే చాలా అభిమానం అతనికి. అతను విజయవాడలో ఉన్నాడు. అసలు అతని దన్ను చూసుకునే సుందరం యిష్టంవచ్చినట్లు లంచాలు పుచ్చుకున్నది!

"నేను వెళ్ళి సంగతంతాచెప్పి మామయ్య కాళ్ళు పట్టుకుంటాను, హైద్రాబాదు పంపిస్తాను. మనకి కావలసిన ఆఫీసరు మామయ్యకి బాగా ఫ్రెండు. లేకపోతే ఏ మినిష్టరునో పట్టుకుంటాడు. పోనీ మీరూ రారాదూ?" అంది జయలక్ష్మి.

"అమ్మో యిలాంటప్పుడు నేను కదలకూడదు. నువ్వైనా యీ పనిమీద వెడుతున్నట్టు

బ్రహ్మదేవుడికి తెలియకూడదు. ఆయనికి ఎలా నచ్చచెబుతావో యేమో."

భర్త ఏదో చెబుతూనేవున్నాడు. జయలక్ష్మి ఇంకేదో ఆలోచిస్తుంది.

"నెలజీతం ఎవడికి కావాలి! నెలకి రెండు వేలకి పైన సంపాదించేవాడు ఆయన. నిజానికి ఉన్నట్టుండి యిప్పుడు పనిలోంచి డిస్మిస్ చేసినా కూర్చుని తినే ఆస్తి మిగిలివుండును. ఇద్దరిలో ఒక్కరికైనా ఏమాత్రం పొదుపు ఉన్నాసరే.... తిండికీ బట్టకీ దర్జాకీ, ఎక్కళ్లేనిది చాలేది కాదు. ఎంత వచ్చినా ఏ నెలకానెల అప్పులు. స్నేహితులు, డిన్నర్లు, పార్టీలు, ఒకటా! అన్ని పోయాయి. ఆడంబరం మిగిలింది! జరిగినన్నాళ్ళూ దర్జాగా, హాయిగా గడిపారు. అలా ఎందుకనుకోకూడదు!

"ఏమిటి ఆలోచిసున్నావ్...."

"మామయ్యతో చెప్పి చక్రం అడ్డువేయించే పూచీ నాది. రేపు ఒక్కరోజు ఆగి ఎల్లుండి బయల్దేరుతాను".

"ఎల్లుండే? సరే కానియ్యి..... అన్నట్టు యింకోమాట.... నీకు సాయంలేదనే బాధకూడా ఉండదు. మా స్నేహితుడు రవణ నీకుతెలుసుగా! అతనిభార్య కూడా ఎల్లుండి మెయిల్లోనే బెజవాడే బయల్దేరుతోందిట. ఇంకేం, ఒకరికొకరుతోడుగా ఉండొచ్చు..... నేనలా ఓసారి తిరిగి వస్తా...."

సుందరం గబగబా వెళ్ళిపోయాడు.

జయలక్ష్మి నెత్తిమీద పిడుగులాంటి మాట వేసి!

ఆ రాధే అయిఉంటుంది. సందేహం దేనికి!

ఓ మెట్రిక్ కాదు, బియ్యే కాదు ఎం.ఏ., పాసయిన రాధ!

ఆమెతో కలిసి ప్రయాణమే, ఇంకేమైనా ఉందా!

అంత చదువుకున్నది ఇంగ్లీషులో తప్ప మాటాడుతుందా, తనని కన్నెత్తి చూస్తుందా, అసలు ఎక్కడయినా కిందా మీదా ఉంటుందా!

ఆరోజు పేరంటంలోనే తెలిసిపోలేదూ ఆ అమ్మాయి అహంకారం! పట్టుచీర బరువు మొయ్యలేక అందరూ కలవరపడుతూంటే ఎంతో సింపుల్‌గా ఒకే ఒక్క గాజులజతా, చిన్న నల్లపూసలదండా వేసుకుని తన ప్రత్యేకతను చాటుకోవాలనే, తను ఇంత చదువుకున్నానని నలుగురికి తెలియచెప్పాలనేకదూ ఆ తాపత్రయం! అప్పటికి తను ఉండబట్టలేక ఆ మాట పైకి అనేసిందికూడా! ఏదోఒకటి జవాబుచెప్పొచ్చుగా! నాలుగుమాటలు ఆడితే నవరత్నాలురాలిపోతాయా! మరి తనలా అందరూ చదువుకున్న వాళ్ళే ఉంటారా! లేకపోతే తనలాంటి వాళ్ళతో మాటాడితే తనకి పరువుతక్కువ అనుకుందా!

"ఈయనకి పనీపాటూ లేదు, ఇలాంటివే లేనిపోనివి చుట్టబెట్టుకువస్తారు" ఎంత తప్పుపని ఎవరిపట్ల చేసినా భర్తపట్ల కోసమన్నది ఎరగని జయలక్ష్మికి ఆనాడు ఎక్కళ్ళేని కోపమూ వచ్చింది. ఆమెను అప్పుడు బాధిస్తున్నది భర్త ఉద్యోగం ఎక్కడ పోతుందో అని కాదు. అది ఆలోచించడం

మానేసి ఆమె చాలా సేపయింది. ఈ రాధని ఎలా వదిలించుకోవడం! భగవంతుడా నీకు దయామయుడని బిరుదు ఉన్నదే. అదెందుకు రుజువుచేసుకోవు! అనుకుంది జయలక్ష్మి.

"దానికింత కంగారు పడడమెందుకు? ఓలా చేస్తే సరీ" అనుకుంది తర్వాత. సుందరం యింటికిరాగానే.

"నేను ఎల్లుండి వెళ్ళడం లేదండీ" అంది ఆమె.

"అదేం ఆలస్యంచేస్తే మీ మామయ్య దొరకడేమో" అన్నాడతను.

" ఆ ఒక్కరోజుకీ ఎక్కడికి పోతాడని! ఆవలెల్లుండి బయల్దేరతాను!"

"అయితే ఆ సంగతి రవణకీ చెప్పొస్తాను. పాపం నీతో ప్రయాణం చేద్దామని ఆ అమ్మాయి ఎంతాశ పెట్టుకుందో, ఒక్కరోజు కదా! రాధ కూడా ప్రయాణం రోజు మార్చుకోవచ్చు."

"ఆమెతో ప్రయాణం చెయ్యడం నాకిష్టంలేదు..." అని ఆమాట ఆపేసి నందుకు నాలిక్కరుచుకొని "ఎంచేతంటే.. ఎంచేతంటే.... చూడండి ... ఇదా రహస్యమైన వ్యవహారం, నానోట్లో నువ్వుగింజ దాగదు. తీరా ఆలోచించో ఆలోచించకుండానో ఆ రైల్లో మాటల సందర్భంతో, యిలా ఫలానా పనిమీద నేనా ఊరువెడుతున్నాని పొరపాటున రాధతో అనేస్తే యింకేమైనా ఉందీ! కొంపలు అంటుకోవూ! అయినా ఇదివరకు నేను వంటరిగా వెళ్ళలేదు కనకనా, ఎందు కనవసరంగా లేనిపోని ఆపద కొనితెచ్చుకోవడం మీరూ ఆలోచించండి" అని పూర్తి చేసింది.

"అవును నువ్వన్నదే బాగుంది..... నేనంత దూరం ఆలోచించలేదుసుమీ" అన్నాడు సుందరం. జయలక్ష్మి ముఖం కళకళలాడింది.

"ఈపాటికి చిట్టికి జ్వరంవచ్చి ఇరవై రోజులయిపోయి ఉంటుంది. ఈసరికైనా నార్మలుకి వచ్చి పత్యం పెట్టిఉంటే బాగుణ్ణు, పాపం పెద్దక్క ఒక్కర్తీ అందరు పిల్లలతో ఎలా చేసుకొస్తోందో...

కూలివాడిచేత సామాన్లు ప్లాటుఫారం మీద కాస్త నీటుగా ఉన్నచోట పెట్టించి రాధని అక్కడ ఉండమని రవణ టికెట్లు తేడానికి వెళ్లాడు, రాధ అక్కడే ఉందిగాని ఆమె మనసు బెజవాడలోవుంది.

"పెద్దబావ నెలకి మూడువారాలు పై వూళ్ళలో ఉంటాడు. ఉన్నా అటువస్తువు యిటు తీసిపెట్టని స్వభావం.... పాపం పెద్దక్క ఒక్కర్తీ అన్నాళ్ళుగా జబ్బుతో ఉన్న చిట్టితో.... రాధమనసు సడెన్‌బ్రేక్ వేసినట్టు ఆగిపోయి మరొకవైపు స్టార్టయింది. ఏమిటి తను కళ్ళతో చూస్తున్నది!

రవణ జయలక్ష్మినీ సుందరాన్నీ, వెంట బెట్టుకు వస్తున్నాడు! పైగా సిగ్గులేక ఏదో ఘనకార్యం చేసినట్టు యింత మొహం చేసుకుని "రాధా, రావోయ్! మనం ఎంత అదృష్టవంతులమో చూడు. అప్పటికప్పుడు మనలాగే వాళ్ళకి ఆటంకం ఏదోవచ్చి, ఈమె కూడా యివాళే ప్రయాణం పెట్టుకున్నారట.... మీరిద్దరూ కలిశారు. యింక మాకు చీకూ చింతా ఉండదు. ఏమండీ సుందర్రావుగారూ! అన్నాడు.

"కాదు మరీ! ఈ రోజుల్లో ప్రయాణాలంటే మాటలా! ఒకరికొకరు తోడయ్యారంటే మన

మగాళ్ళకి ఎంత రిలీఫ్‌గా ఉంటుందీ. ఆ సామాన్లు అక్కడ పెట్టవోయ్‌కూలీ! రండి రవణమూర్తి గారూ, అలా బుక్‌స్టాల్‌దాకా వెళ్ళొద్దాం, యింకా టైం ఉందిగా!"

"ఏమండీ, యిదిగో మాట!" అని ఏదో చెప్పడానికి రాధ విశ్వప్రయత్నం చేస్తూనేఉంది మగాళ్ళిద్దరూ ఒకళ్ళ భుజాలమీద మరొకళ్ళు చెయ్యివేసుకుని ఒళ్ళెరగని కబుర్లతో ముందుకి సాగిపోయారు.

"అబ్బ, ఏం ఉక్కగాఉందీ!" అని నువ్వూ అనకుండా పలకరించి నుదుటనుపట్టిన చెమట తుడుచుకుంటూ రాధ తలవంచి. జయలక్ష్మి సామాన్లు చూడగానే ఆమె చెమట మరింత ఎక్కువయింది. లేత ఆకుపచ్చరంగు, అర్ధ చంద్రాకారపు జిప్పు బ్యాగు, ఎంత బాగుంది! పక్కని మిలమిల మెరిసిపోయే సరికొత్త హోల్డాలు! ఈ జన్మలోకాదు. యింకో ఏడు జన్మలకయినా తన మొహానికి అలాంటి సామాన్లు కొనగలిగే తాహతు వస్తుందా! మంచి పనితనం కనిపిస్తున్న ఎర్రరంగు వెండిబోర్డరు చెప్పులు! వాటికి కొంచెం ఎత్తున అటూయిటూ పరుచుకుని ఉన్న కుచ్చెళ్ళ చివర కొట్టొచ్చినట్లు కనబడుతున్న ఇంత వెడల్పు జరీ! దూరంనుండి రాధని చూస్తునే జయలక్ష్మి కాళ్లు, ప్రయత్నంగా ఆగిపోతే" పదండమ్మా పదండి... ఇంత రష్‌లోనూ భగవంతుడు మనపట్ల ఉన్నాడు కాబట్టి మిమ్మల్ని కలుసుకోగలిగాను" అని రవణా, "మీ వాళ్ళూ యివాళే బయల్దేరుతున్నారూ! అమ్మయ్య.... ఇంక నాకు చింతుండదు" అని సుందరం గబగబ అటు అడుగులు వేశాడు.

దూరాన్నుంచే జయలక్ష్మి కంటబడింది రాధ చేతిలో యింగ్లీషుపేపరు! అంతకన్న వేగంగా తన గుండె రెపరెపలాడింది, తప్పక అటువైపు అడుగులువేసి...

"ఇంకా ఎంతసేపటికొస్తుందో పాడు మెయిలు!" అని ఒక రిమార్కు చేసి అటుతిరిగి బుగ్గన వేలు పెట్టుకుని కూచుంది.

రాధకి ఆ పెడసరంచూస్తే ఒళ్ళు మండింది. ఎంత డబ్బులుంటేమాత్రం అంత అహంకారం తగునా! లోకంలో ఉన్నవాళ్ళూ ఉంటారు, లేని వాళ్ళూ ఉంటారు. ఆ మాత్రం మంచీ చెడ్డా ఉండొద్దూ! రాధ ధైర్యంగా జయలక్ష్మివైపు చూశాననుకుంది.

"ఈ వేళ వచ్చి రేపుపోయే సిరిని చూసుకుని ఎందుకే చిందులుతొక్కుతావ్!" అని దాని సందేశం.

జయలక్ష్మి కోపంగా రాధవైపు తిరిగాననుకుంది.

"ఎలాగైతేనేం నాలుగు బొట్లేరుముక్కలు నేర్చేనని ఎందుకే ఆమిడిసిపాటు!" అని దాని తాత్పర్యం.

ఇంకా ఎన్నెన్ని జరుగునో గంట గణగణ మోగింది.

"అటువైపు పెట్టెలు ఖాళీగా ఉన్నట్టున్నాయి కాబోలు" అని రాధ స్వగతాన్ని పైకి అనేసి కూలివాణ్ణి పరిగెత్తించి, తను అనుసరించి, జయని వదుల్చుకుంది.

"అమ్మయ్య!" అని జయ అనుకునేలోగానే "లేవండీ, రైలొచ్చేస్తుంది" అని సుందరం, రవణా పరిగెత్తుకొచ్చాడు.

"రాధ ఏదీ, ఓహో అటు వెడుతోంది.... దీని కొకటే హడావిడి .... మీరూ అటే రండమ్మా" అంటూ రవణ అటు పరిగెత్తేడు.

జయలక్ష్మి ఒక పట్టాన కదల్లేదు.

"ఇంకా కదలవేం. వాళ్ళెంతదూరం వెళ్ళిపోయారో ఏమిటో!"

కూలివాణ్ణి పిలవడంలో మరింత ఆలస్యం చేసింది ఆమె.

"నీకేం మతిపోయిందా ఏమిటి? ఇప్పుడు నీకు జాగానే చూసుకుంటావా, రాధనే వెతుక్కుంటావా! పదపద" అని సుందరం తొందర చేశాడు.

"ఉష్... ఆవిడ రిజర్వేషనో ఏదో చేయించుకున్నట్టుంది, యిందాక టిక్కెట్టు కలెక్టరుతో ఇంగ్లీషులో మాటాడుతూంటే విన్నాను...."

"నీమొహంలా ఉంది..... పద,పద, లే..." ఇద్దరూ గబగబ అటు అడుగులు వేశారు, వెనక కూలివాడు సామాన్తో రాగా.....

"ఇన్నాళ్ళయినా మీకు మనుష్యులతత్వం బోధపళ్ళేదు, మనలా థర్డు క్లాసులో ప్రయాణం చేసే ఖర్మం వాళ్ళకేంపట్టింది? ఏ ఫస్టు క్లాసు టిక్కెట్టో కొనుక్కుని ఉంటారు వాళ్ళు.... ఎంతో దు:ఖంతో బయలుదేరుతున్నాను నేను. నన్ను ఇలాంటప్పుడు కూడా రచ్చకెక్కిస్తేగాని మీకసి తీరలేదా!"

ఇంకా ఎన్నో మనసుతీరా మొగుణ్ణి మనసులో దీవించుకుంటూ ఎదురుగా కనబడిన థర్డు క్లాసు కంపార్టుమెంటులోకి దబాయించి ప్రవేశించింది రాధ. ఆవేళకి రవణవచ్చి కలుసుకున్నాడు ఆమెని.

"లోపలికెళ్ళి సర్దుకుని కూచో.... ఉండు... జయగార్ని కేకేస్తాను."

రవణ కేకవేసేముందే రైలు కూతకూసింది. ఆరంకెకే అంతర్రైలూ గజగజ వణికిందా అన్నట్టు కదిలింది. అయితే రవణ కేకవేసే అవసరం లేకుండానే అన్నంత పనీ జరిగింది. అదే కంపార్టుమెంటు ఆ చివర గుమ్మంలోంచి రాధ ఎక్కినప్పుడే ఈ చివర గుమ్మంలోంచి జయలక్ష్మి ఎక్కింది. సీట్లకోసం అట్నించి ఆవిడా, యిట్నించి ఈవిడా తిరిగి తిరిగి యించుమించు మధ్యకు వచ్చారు. ఒకర్నొకరు ఆహడావిడిలో చూచుకోలేదు కాని, పక్కపక్క కిటికీల్లోంచి మొగుళ్ళకోసం యివతలికి తొంగిచూశారు, కదుల్తున్న రైల్లో వాళ్ళిద్దర్నీ అలా పక్కపక్క చూడగానే ఎంతో ముచ్చటవేసింది. "ఉయ్ ఆర్ వెరీ లక్కీ" అని ఒకళ్ళ నొకళ్ళు కౌగిలించుకొన్నంత పని చేశారు. సమానాంతరంగా వున్న ఆ పట్టాలమీద రైలు మాత్రం పరుగుపెడుతూనే వుంది!

★